క్లుప్తంగా

కలెక్టర్‌ని కలసిన మామిడి రైతులు

విజయపురం(వడమాలపేట): మామిడి రైతులకు ఇవ్వాల్సిన టన్నుకి ఎనిమిది వేలు ఫ్యాక్టరీ యాజమాన్యం ఇవ్వడం లేదని వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం రైతులు సోమవారం కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి కోతకు ముందు టన్నుకి రూ.8 వేలు ఇస్తానన్న ఫ్యాక్టరీ యజమాన్యం ఇప్పుడు రూ.4 వేలు ఇస్తానని చెప్పడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా మామిడి రైతులకు రూ.8 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాధవరాజు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం లాభదాయకం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

గంగాధరనెల్లూరు: ప్రకృతి సేద్యం ఎంతో లాభదాయకమని, ప్రకృతి సేద్యంలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు తినడంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ అధికారి ధనలక్ష్మీ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు, ప్రదర్శన చేపట్టారు. రసాయనాలు వినియోగించకుండా పండించిన ఆకుకూరగాయలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి హేమావతి, సభ్యులు కళావతి, భానుమతి, రామేశ్వరి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసే వినతులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆయన సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మ్యుటేషన్‌కు సంబంధించి ఒకటి, శ్మశానానికి దారి కల్పించాలని ఒకటి, భూసర్వేకు 2, ఇళ్ల నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 2, పట్టాదారు పాసు పుస్తకం కోసం 2, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులు చూపించాలని 2, బర్త్ సర్టిఫికెట్‌కు 3, డెత్ సర్టిఫికెట్ కోసం 2, రేషన్ కార్డు కోసం ఒకటి వినతులు వచ్చినట్టు తెలిపారు.

ఘనంగా ధ్వజారోహణం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, గ్రామస్తులు

గంగాధరనెల్లూరు: మండలంలోని కోటాగరం పంచాయతీ ఎట్టేరి గ్రామంలో వెలసిన శ్రీవళ్లీ దేవసేన సమేత శివషణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం ఆడికృత్తిక సందర్భంగా ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమాలు చేశారు. ఈ నెల 15న భరణి, 16న కృత్తిక కావడి చెల్లింపులు, 17న కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ధర్మకర్తలు తెలిపారు.

ముగిసిన కుంభాభిషేక మహోత్సవాలు



పూజల్లో పాల్గొన్న పద్మనాభరెడ్డి

వెదురుకుప్పం: మండలంలోని అగ్గిచేనుపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గా భవాని అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం ముగిశాయి. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రేపు వాహనాల వేలం

తవణంపల్లె: మండలంలో అక్రమంగా మద్యం తరలిస్తూ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు తవణంపల్లె పోలీస్ స్టేషన్‌లో జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో పట్టుబడిన వాహనాలను విక్రయించడానికి బహిరంగ వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు రుసుం చెల్లించి పాల్గొనాలని సూచించారు. ఇతర వివరాలకు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అందని నిరుద్యోగ భృతి

నేను సీఎం అయిన వెంటనే ఇంటికో ఉద్యోగమిస్తా.. నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అందిస్తా.. ఎవరూ భయపడొద్దు.. బాబు వస్తే ఇంటికి జాబొస్తా దీ..₹ ఇదీ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊరూరా చేసిన ప్రచారం. అయితే ప్రస్తుతం ఈ మాటలన్నీ నీటి మూటలవుతున్నాయి.

- నగరి నియోజకవర్గంలో మొత్తం నిరుద్యోగులు 14,400
- ఉద్యోగాల నోటిఫికేషన్ ఎప్పుడిస్తారోనని ఎదురుచూపులు
- ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు

మండలాల వారీగా నిరుద్యోగుల సంఖ్య

నగరి మున్సిపాలిటీ	:	3000
నగరి మండలం	:	2000
పుత్తూరు మున్సిపాలిటీ	:	2500
పుత్తూరు మండలం	:	1500
నిండ్ర	:	1700
విజయపురం	:	1800
వడమాలపేట	:	1900
మొత్తం	:	14400



యువత (ఫైల్)

వడమాలపేట (విజయపురం): ఉద్యోగాలు, ఉపాధి కోసం నిరుద్యోగ యువత ఎదురు చూస్తోంది. జాబ్ క్యాలెండర్‌పై యువకులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకు.. నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తానంటూ ఎన్నికల హామీగా ప్రకటించిన సంగతి విదితమే. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నిరుద్యోగ భృతిపై నోరు మెదపకపోవడం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. నియోజకవర్గంలో భారీ సంఖ్యలో యువకులకు ప్రభుత్వ కొలువులు వస్తాయని.. లేదంటే నిరుద్యోగ భృతి అందుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో డిగ్రీ అర్హతతో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్, పదో తరగతి అర్హతతో ప్రభుత్వ కొలువుల కోసం ఆశ పడేవారు 11 వేల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు తమ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంతవరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో తెలిపారు. దీంతో నిరుద్యోగులు ఎంతో ఆశతో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ కొలువుల కోసం కష్టపడి ఆగిపోయిన వారంతా కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి హామీతో తిరిగి పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండడంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలు రాష్ట్రాల్లో నిరుద్యోగ భృతి

హరియానాలో ఇంటర్, పీజీ విద్యార్హత కలిగిన వారికి నెలకు రూ.900 నుంచి రూ.3 వేలు, పశ్చిమ బెంగాల్‌లో ఏడో తరగతి ఆపై చదివిన వారికి రూ.1500 అందిస్తున్నారు. మన రాష్ట్రంలో రూ.3 వేలు నెలకు అందించడంతోపాటు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు అందించాల్సి ఉంది. కొత్త ఉద్యోగాల సంగతి పక్కన పెడితే ఇప్పటికే వలంటీర్లు, రేషన్ వ్యాన్ డ్రైవర్ల ఉద్యోగాలు ఉంటాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అందరి చూపు

2004 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతిని తమ హామీగా ప్రకటించింది. అయితే ఆ ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతి పొందడానికి విధివిధానాల రూపకల్పన మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి సవాలక్ష ఆంక్షలు విధించి, నిరుద్యోగ భృతి ఇచ్చే వారి సంఖ్యను కుదించింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ అనర్హులని తేల్చడంతో పాటు 22 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు డిగ్రీ చదివిన వారికే భృతి వర్తిస్తుందని మెలిక పెట్టింది. డ్రైవింగ్ లైసెన్సు, 120 సీసీ ద్విచక్ర వాహనం ఉన్నవారికి సైతం భృతి ఇవ్వలేదు. అది కూడా 2019 ఎన్నికలకు కొన్ని నెలల ముందు అమలు చేశారు. ఆ అనుభవం దృష్ట్యా ఈసారైనా ఉద్యోగం వచ్చే వరకు ఎలాంటి మెలికలు లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వాణిజ్యంతో సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: వాణిజ్యం ద్వారా సమాజాభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి తెలిపారు. సోమవారం కళాశాలలో అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ అన్ని రంగాల్లోకి వాణిజ్య రంగం అతి ముఖ్యమైన రంగమని అన్నారు. ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను మెరుగుపరచడంలో వాణిజ్యం ఎంతో కీలకమన్నారు. అంతర్జాతీయ వ్యాపార విధానాలు, మార్కెట్ స్థితిగతులు, వివిధ దేశాల వ్యాపార స్వభావం, వినియోగదారుల ప్రవర్తన తదితర అంశాలు అంతర్జాతీయ వాణిజ్యంపై ఆధారపడి ఉంటాయన్నారు. వాణిజ్యాన్ని గుర్తించి అవగాహన చేసుకోవడం కామర్స్ విద్యార్థుల ముఖ్య కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగం అధిపతి దేవకి, అధ్యాపకులు గంగయ్య, వాసవి, శ్రీనివాసులు, లక్ష్మీబాయి, నాగరాజు, నరసింహులు, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది



ఈడిగపల్లిలో గత ప్రభుత్వం నిర్మించిన హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే



ఆరిమాని గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి

- గత ప్రభుత్వంలో నిర్మించిన పలు భవనాలు
- కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రారంభోత్సవాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: జీడీనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం, పాలసముద్రం మండలాల్లో గత ప్రభుత్వం హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించింది. వాటిని సోమవారం ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే థామస్ ప్రారంభించారు. దీన్ని చూసిన ప్రజలు సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది అన్న చందంగా ఉందని విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రెండు వేల జనాభాకు ఒకటి చొప్పున సచివాలయాలు నిర్మించి ప్రజల వద్దకే సేవలు అందించారు. అలాగే రోగులకు గ్రామస్థాయిలో నాణ్యమైన వైద్యం అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్కులు నిర్మించారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని ప్రారంభించి తామే చేసినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అంతేగాక జగనన్న కాలనీల్లో తూతూమంత్రంగా సీసీ రోడ్లు వేసి బోర్డులు ఏర్పాటు చేసుకుని శునకానందం పొందుతున్నారని, అదే విధంగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటుక రాయి కూడా పెట్టి భవన నిర్మాణం చేయకపోయినా తామే చేసినట్టు శిలాఫలకాలు వేయిస్తున్నారని గుసగుసలాడుతున్నారు.

ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక పూజలు

మండలంలోని కేశవకుప్పం పంచాయతీ పసలవానిమిట్ట గ్రామంలో నిర్మించిన ఆరిమాని గంగమ్మ ఆలయంలో చేపట్టిన మహా కుంభాభిషేకంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే థామస్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం



సంఘం విడుదల చేసిన పోస్టర్

పుత్తూరు: రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్ర సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి మార్గదర్శకంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. తగిన కార్యాచరణ రూపొందించి అందరి ఆమోదంతో అమలు చేయనున్నట్లు తెలిపారు.

బైక్-కారు ఢీ

పూతలపట్టు(యాదమరి): చిత్తూరు-కడప జాతీయ రహదారి రంగంపేట క్రాస్ బ్రిడ్జి వద్ద సోమవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో తండ్రి, కూతురు తీవ్ర గాయాలపాలయ్యారు.

శేష వాహనంపై ద్రౌపదీదేవి విహారం



ద్రౌపదీదేవి సమేత శ్రీఅర్జునస్వామి ఊరేగింపు

పుత్తూరు: ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శేష వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి విహరించారు. ఇంటింటా భక్తులు కర్పూర హారతులిచ్చారు. ఉదయం 6 గంటలకు స్థానిక మంచినీళ్ల గుంట నుంచి పోతురాజు రక్షకుడిగా ముందు నడవగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 11 గంటలకు స్థానిక హరిజన సంఘం ఆధ్వర్యంలో ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి ఉత్సవం తిరువీధుల్లో ఊరేగింపుగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు భీముడు బకాసురుడిని వధించే ఘట్టాన్ని కోలాహలంగా నిర్వహించారు. రాత్రి శేష వాహన సేవ విశ్వనాథంపిళ్లై కుమారుల ఆధ్వర్యంలో కనుల పండువగా జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, కోఆప్షన్ మెంబర్ చీరాల, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 9 గంటలకు పల్లకి సేవ, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు మత్స్యయంత్ర ఛేదన, అనంతరం శాస్త్రోక్తంగా అమ్మవారి కళ్యాణోత్సవం. రాత్రి 8 గంటలకు అశ్వ వాహనంపై అమ్మవారి ఊరేగింపు. రాత్రి 9 గంటలకు ఏకాంత సేవ నిర్వహించనున్నారు.



బకాసుర ఊరేగింపు

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



పిల్లలకు యూనిఫాం అందజేస్తున్న సీడీపీఓ శోభారాణి

కార్వేటినగరం: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి తెలిపారు. మండలంలోని టీకేఎం పేట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఆమె మాట్లాడుతూ బాలింతలు పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలలో అన్ని రకాల పోషకాహారాలు ఉంటాయని, బిడ్డల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

దాతల సేవలు అభినందనీయం

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని సీడీపీవో శోభారాణి అన్నారు. సోమవారం టీకేఎం పేట అంగన్‌వాడీ చిన్నారులకు దాత రాజ్‌దాస్ యూనిఫారాలను వితరణ చేశారు. ఆయనను సీడీపీవో అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో బ్యాగులు, బిస్కెట్ల పంపిణీ



చేనేత యూనియన్ బ్యాగ్‌లతో విద్యార్థులు, తల్లిదండ్రులు

నగరి: జాతీయ చేనేత వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ పిల్లలకు స్థానిక చేనేత కార్మిక యూనియన్ నాయకులు బ్యాగులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. సోమవారం జాతీయ గ్రామీణ సాక్షరతా మిషన్, న్యూఢిల్లీ వారి సహకారంతో చేనేత కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షుడు కేవీ కుప్పయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పంపిణీ కార్యక్రమానికి చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు ముఖ్య అతిథిగా విచ్చేశారు. మండలంలోని మాంగాడు, దళితవాడ, నగరి ఎస్టీ కాలనీ, నగరి బాలికలు, నగరి తలారి వీధి అంగన్‌వాడీ సెంటర్లకు వెళ్లిన వారు విద్యార్థులకు బ్యాగులు, బిస్కెట్లు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు మాట్లాడుతూ చేనేత వారోత్సవాలు నిర్వహించుకునేందుకు తామెంతో సంతోషిస్తున్నామన్నారు. విద్య పిల్లలకు చాలా అవసరమని తెలిపారు. నర్సరీ స్థాయి నుంచి పిల్లలకు బలమైన పునాది కల్పించాలన్న ఉద్దేశంతోనే విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ, చేనేత కార్మిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందల బాలాజీ, స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

గంగాధరనెల్లూరు: మద్యం మత్తులో గంగాధర నెల్లూరులోని ఓ క్వారీ సమీపంలోని నీటి గుంతలో పడి సోమవారం సాయంత్రం ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానిక పోలీసుల సమాచారం మేరకు.. జీడీ నెల్లూరు మండలం, బలిజపల్లి నుంచి సర్వేరెడ్డిపల్లికి వెళ్లే మార్గంలోని కొండ వద్ద ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి కైబల్యా నాయక్ (35) క్వారీ సమీపంలోని నీటి గుంతలో పడి మృతిచెందాడు. జీడీ నెల్లూరులో మద్యం సేవించి తిరిగి వెళ్తుండగా మార్గ మధ్యలో రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడి ఊపి రాడక అక్కడికక్కడే మృతి చెందినట్లు క్వారీ కార్మికులు గుర్తించారు. ఈ ఘటనపై క్వారీ మేనేజరు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ





మాట్లాడుతున్న ఎంపీడీఓ పురుషోత్తం, పాల్గొన్న సిబ్బంది

వెదురుకుప్పం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చని ఎంపీడీఓ పురుషోత్తం తెలిపారు. వెదురుకుప్పంలో సోమవారం జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా నియంత్రించాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని, కాలువల్లో మురుగు తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కృష్ణచైతన్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గాయత్రి, సీహెచ్‌వో మధుసూదన్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ మోహన్‌మురళీ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి



తహశీల్దార్ రవికుమార్‌కు అర్జీలు ఇస్తున్న సీపీఐ నాయకులు

నగరి: పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. సోమవారం తెరణి దళితవాడకు చెందిన ప్రజలతో తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఇంటి పట్టాలు కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. పట్టాలు కోరే నిజమైన అర్హుల నుంచి అర్జీలను రెవెన్యూ అధికారులకు అందజేశారు. అర్జీలను క్షేత్రస్థాయిలో విచారించి, ఇంటి స్థలాలు అందజేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మూడు సెంట్లు స్థలానికి పట్టా ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ భూములు పూర్తిగా సర్వే చేసి భూములు ఉన్నచోట పట్టాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, రూరల్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పట్టణ నాయకులు ముత్తు యేసయ్య, మహేంద్ర, గ్రామ కమిటీ నాయకులు తంగరాజు, రవి, కన్నన్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగాహన



పంటల బీమా పథకంపై అవగాహన

తవణంపల్లె: పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. సోమవారం మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో రైతులకు పంటల బీమా పథకంలో భాగంగా ప్రీమియం చెల్లింపునకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు బీమా ద్వారా ఆదుకుంటామన్నారు. పంట కోత ప్రయోగాల ద్వారా అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి బీమా ఇవ్వడం జరుగుతుందని వివరించారు. పంట రుణం తీసుకున్న రైతులు కామన్ సర్వీస్ సెంటర్‌లో బీమా చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు సమీప రైతు సేవా కేంద్రాల్లో బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. వరి పంటకు బీమా చెల్లించడానికి ఈ నెల 30వ తేదీ వరకు గడువును పెంచినట్లు స్పష్టం చేశారు. అదేవిధంగా రాగి పంటకు ఎకరాకు రూ.170 ప్రీమియం చెల్లించి పంట నష్టపోతే రూ.17 వేలు అందిస్తారన్నారు. రూ.400 ప్రీమియం చెల్లిస్తే ఎకరాకు రూ.20 వేలు, రూ.840 ప్రీమియం చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే ఎకరాకు రూ.42 వేలు బీమా వర్తిస్తుందని స్పష్టం చేశారు. పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ సోమవారం పూజలు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం సమీపంలోని సుద్దగుంట వద్ద వెలసిన శ్రీ శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం శిష్టా సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కోదండపాణి మొదలియార్ పాల్గొన్నారు.